## 168. మొదటి పాఠం

ఓ ఊళ్ళో చాతుర్మాస దీక్ష చేసే ఓ సన్యాసి ప్రవచనం పూర్తిచేసాక చెప్పాడు.

"రేపు అబద్ధం ఆడితే వచ్చే అనర్థాల గురించి చెప్తాను. మీరంతా భగవద్గీతలోని పంతొమ్మిదో అధ్యాయాన్ని పూర్తిగా చదువుకుని వస్తే, అప్పుడు నేను చెప్పేది మీకు బాగా అర్థమవుతుంది."

మర్నాడు ఆయన తన ప్రవచనాన్ని మొదలు పెట్టబోతూ అడిగాడు.

"మీలో ఎంతమంది నిన్న నేను చెప్పినట్లుగా పంతొమ్మిదో అధ్యాయం చదువుకుని వచ్చారు?"

అందరూ చేతులు పైకి ఎత్తారు. ఆ సన్యాసి నవ్వి చెప్పాడు.

"గీతలో పద్దెనిమిది అధ్యాయాలే తప్ప పంతొమ్మిదో అధ్యాయం ఉండదు. అబద్ధం ఆడితే త్వరగానో లేదా ఆలస్యంగానో మీరు తప్పక పట్టుబడతారు కాబట్టి ఎన్నడూ అబద్ధం ఆడకూడదన్నది మొదటి పాఠం."

## 169. అంతర్యామి చిరునామా

తీర్థయాత్రలు చేసే ఇద్దరు తాత్వికులని చూసి ఓ ముసలావిడ వారిని రాత్రికి భోజనానికి తమ ఇంటికి రమ్మని పిలిచింది. తన గుడిసెలో ఆవిడ వంట చేస్తూండగా వీళ్ళ మాటలు విని లేచింది. కొద్దిసేపటికి ఆవిడ బయటకి వచ్చి ఏదో వెదకడం చూసిన వారు ఏం వెదుకుతున్నావని అడిగారు.

"ఆవాలు నేల మీద వలికాయి. వాటి కోసం వెదుకుతున్నాను." జవాబు చెప్పింది.

"అదేమిటి? ఆవాలు గుడిసెలో ఒలికితే బయటెందుకు వెదుకుతున్నావు?" వాళ్ళు ప్రశ్నించారు.

"ఇకుడ లెటు ఉంది కాబట్టి. గుడిసె అంతా చీకటి కదా."

"పిచ్చిదానిలా ఉన్నావే? లోపల ఒలికితే బయట వెదుకుతావే?" అడిగారు వాళ్ళు.

"నేను పిచ్చిదాన్ని ఐతే మీరు అంతకన్నా రెట్టింపు పిచ్చివాళ్ళు." నవ్వుతూ జవాబు చెప్పిందావిడ.

"అదేమిటి? ఎందుకలా అంటున్నావు?"

"మీ అంతరంగంలో దాక్కుని ఉన్న అంతర్యామిని వదిలి మీరు ఆయన కోసం పుణ్య క్షేత్రాలు వెదుకుతున్నారు కాబట్టి అన్నాను."

వాళ్ళు స్వస్వరూప అన్వేషణ గురించి తెలుసుకుని తమ ఇళ్ళకి తిరిగి వెళ్ళిపోయారు.

## 170. నిజమైన పరోపకారి

ఓ ఊళ్ళో చాలామందికి పరోపకారం చేయాలని చాలా కోరికగా ఉంది. ఓ రోజు ఓ దినపత్రికలో ఓ ప్రకటన వచ్చింది.

'పరోపకారం చేయాలనుకుంటున్నారా? ఐతే సదరన్ ప్రెస్టేజ్ ఫ్లాట్స్ బిల్డింగ్‌లోని ఏడువందల ఏడో నంబరు అపార్ట్‌మెంట్‌లో జరిగే మీటింగ్‌కి సాయంత్రం ఆరుకి రండి.'

ఎడ్రసు, ఫోన్ నంబరు ఇచ్చారు. ఆ సాయంత్రం చాలామంది ఆ అపార్ట్‌మెంట్ బిల్డింగ్‌కి వెళ్ళారు. లిఫ్ట్ రిపేర్‌లో ఉందన్న బోర్డుని చూసి, వారిలో కొందరు మెట్లెక్కి పైకి వెళ్ళారు. మరికొందరు అన్ని మెట్లు ఎక్కబుద్ధి కాక వెనక్కి తిరిగారు.

ఆ మీటింగ్‌ని ఆరంభించే వ్యక్తి తన చేతిలోని 'లిఫ్ట్ రిపేర్‌లో ఉంది' అన్న బోర్డుని అక్కడ హాజరైన వారందరికీ చూపించి చెప్పాడు.

"లిఫ్ట్ పని చేస్తోంది. నిజమైన పరోపకారులు మాత్రమే ఈ మీటింగ్‌కి రావాలని ఈ బోర్డుని నేను కావాలని లిఫ్ట్‌కి తగిలించాను."